# హింసరచన

విశాలమైన డబుల్ ట్రాక్ బైపాస్ రోడ్డు లోంచీ కొర్లగుంట రోడ్డులోకి మలుపు తిరిగి, రెండు ఫర్లాంగుల దూరం పరిగెత్తిన తర్వాత మురికి కాలవ వంతెనను దాటి, నన్నటి గొందిలోకి ప్రవేశించి, మరో అరఫర్లాంగు సాగిన తర్వాత చీకట్లో కలిసిపోతున్నట్టున్న చిన్న పెంకుటింటి ముందు ఆగింది సైకిలు. వెనక సీటుపైన కూర్చున్న స్త్రీ కిందికి దిగింది. వెంటనే సైకిలు తొక్కుతూ వచ్చిన వ్యక్తి రొప్పుతూ నేలపైకి దిగేశాడు. కాస్సేపు అలసట తీర్చుకున్న తరువాత సైకిల్ను యింటి పక్కగా నిలబెట్టి స్టాండు వేశాడు.

పది అడుగుల వెడల్పును సైతం మించని ఆ గొంది అక్కడక్కడా మరింతగా నన్నబడిపోతూ, రకరకాల మెకాల్ని వరసగా మింగిన కొండ శిలువలా వికృతంగా కనబడుతోంది. వీధికి రెండు వైపులా అడుగున్నర మేరకు ఆక్రమించుకున్న సైడు కాలవల్లోంచీ నల్లటి మురికి రొచ్చులు రోడ్డుపైకి పొంగుకొస్తున్నాయి. తమ పక్కనున్న యిల్లెంత చిన్నదో తెలపడం కోసమన్నట్టుగా పొడవుగా గాలిలోకి బారలు చాపి నిల్చున్న కరెంటు స్థంభాలపైన, విద్యుద్దీపాలు గుడ్డిగా వెలుగుతున్న చోట, రెక్కల పురుగులు గిరికీలు తిరుగుతున్నాయి. వీధిలోకి చొచ్చుకు రావడం కోసం విఫల ప్రయత్నం చేస్తున్న యిళ్లన్నీ పొట్టలు పగిలిన మేడి పండ్లలా తమలోపలి వస్తువుల్ని బాహాటంగా ప్రదర్శిస్తున్నాయి.

సైకిలు తొక్కుతూ వచ్చిన వ్యక్తి పెంకుటింటి పక్కనున్న సందులోకి దారితీశాడు. మూడడుగల వెడల్పున్న ఆ సందులో చిన్న నులకమంచంపైన వో ముసలి శరీరం జోగుతోంది. మంచం ఆక్రమించుకోగా మిగిలిన కాస్త స్థలంలోంచీ నాలుగడుగులు ముందుకెళ్ళగానే మొదటి పోర్షను గుమ్మం చేరువయ్యింది. తలుపులు బిడాయించుకున్న ఆ పోర్షనుకు కిటికీలు లేకపోవడంతో లోపల మనుషులేం చేస్తూన్నారో తెలియడం లేదు. మరో అయిదడుగులు నడచాక రెండో పోర్షను గుమ్మం యెదురయ్యింది. దాని తలుపులు దోర వాకిలి వేసివుంది. మరో పదడుగుల తర్వాత మూడో పోర్షన్ గుమ్మం కనిపిస్తోంది. ఆ గుమ్మంలోంచీ ముందుకు పడుతున్న వెలుతురు, తలుపులు తెరిచే వున్న విషయాన్ని తెలియజేస్తున్నాయి. ఆ పోర్షనులోంచీ పెద్దగా మాటలు కూడా వినబడుతున్నాయి.

రెండో పోర్షన్ ముందు నిలబడి, తటపటా యిస్తూనే, తలుపుల్ని ముందుకు తోశాడు ఆ వ్యక్తి. అతడి వెనకే నీడలా కదలివచ్చిన స్త్రీ గోడ చాటుకు అడుగేసింది.

నల్లటి టీవి తెరలోంచీ వెలువడుతున్న నీలి కాంతుల్లో గదంతా కరిగి జారుతున్న మంచు ముద్దలా చిత్రంగా కనబడుతోంది. టీవి స్టాండు వెనక పక్షుల గూళ్ళలా కట్టిన రాకేసులోని వస్తువులు స్పష్టంగా కనబడడం లేదు. టీవీకి ఆరడుగుల దూరంలో, గోడ పక్కన సోఫాలో కూర్చున్న స్త్రీ ముఖంలో చీకటి వెలుగులు తారట్లాడుతున్నాయి.

ఆగంతకుడు మెల్లగా గొంతు సవరించుకున్నాడు.

సోఫాలోకూర్చున్న స్త్రీ వులిక్కిపడి లేచి నిల్చుంటూ "యెవురాద?" అంటూ ప్రశ్నించింది. ఆమె గొంతుకు కోరస్‌లా సోఫా కిర్రుమంటూ అరచింది.

అతను లోపలికో అడుగేసి "నేనేలే!" అన్నాడు.

ఆవిడ "నేనంటే?!...." అంటూ దూకుడుగా ముందుకొచ్చింది.

"నేను...శేషాద్రి" అన్నాడతను.

ఆవిడ గబగబా వెనుదిరిగి గోడపైని స్విచ్‌ను నొక్కింది. నలభై కాండిల్ల బల్బు గుడ్డిగా వెలిగింది. అదేదో నాట్య భంగిమలా ఆవిడ స్థూలకాయం అదే వేగంతో యిటు వైపుకు తిరిగింది. అతడి ముఖంలోకి సూటిగా చూశాక "నువ్వా..." అందామె. వెనకున్న స్త్రీని గమనించగానే "లోపలికిరండి.." అంటూ హడావుడిగా పక్కకు తప్పుకుంది.

శేషాద్రి లోపలికొచ్చి సోఫాపైన కూర్చున్నాడు. అతడి వెన్నంటి వచ్చిన స్త్రీ గూడా సోఫాపైన ముడుచుకొని కూర్చొంది. చిరుగులపడ్డ జెర్కిన్ పొరల సోఫా మూల్గుతూ వెనక్కు వాలింది.

యింటావిడ గబగబా తలుపులను వోరగా మూసేస్తూ "యీ వేళప్పుడు... యెవరూ చూళ్లేదు గదా!" అంటూ ముఖం చిట్లించుకుంది.

"నగం వూరు నిద్రబొయ్యింది జయలక్ష్మీ!" అన్నాడు శేషాద్రి ముఖం ముడుచుకుంటూ.

జయలక్ష్మి ముభావంగా సోఫాపై కొచ్చి కూర్చొంది. టీవిలో కార్యక్రమమేదో నిర్లిప్తంగా కొనసాగుతోంది. అరేడడుగుల పొడవూ వెడల్పున్న ఆ చిన్న గది మూలల్లో రకరకాల పాత్రలూ, వస్తువులూ కుప్పలు కుప్పలుగా పడి వున్నాయి. లోపలి గది గుమ్మానికి తలుపులు మూసుకుని వున్నాయి. షో కేసుకు యెడమ వైపున, గోడ పక్కన ముసుగు తన్నుకుని పడుకున్న ఆకారమొకటి కనిపిస్తోంది. సిమెంటుతో కట్టిన షోకేసుకు కుడివైపున, గోడపైన, చెక్క అలమారాలో రకరకాల దేవుళ్ళ బొమ్మలున్నాయి. వాటి పక్కనే గాడిదల బొమ్మలున్న ఫోటోకు వూలమాల వేలాడుతుంది. ఆ ఫోటోలో 'ప్రతి ఉదయమూ లేస్తూనే మమ్ముచూడు. శుభం కలుగుతుంది' అని రాసి వుంది.

పడుకున్న ఆకారంకేసి చూపిస్తూ యెవరని అడుగుతున్నట్టుగా సైగ చేశాడు శేషాద్రి.

"మా నాయిన. మొన్ననే పల్లి నుంచీ వచ్చినాడు" అంది జయలక్ష్మి అతడి పక్కన కూర్చున్న అమ్మాయి కేసి పరిశీలనగా చూస్తూ. ఆ అమ్మాయి ముఖం వెల వెల బోయింది.

"కొంచేపు..వొకే గంట..." అన్నాడు శేషాద్రి వణుకుతున్న గొంతుకతో.

"యిప్పుడా?" ఆవిడ వినరాని మాటను వింటున్నట్టుగా గొల్లుమంది. "లోపల పార్టీ వుండాడు."

"పర్వాలేదు. వైట్ చేస్తాము." అన్నాడు శేషాద్రి టీవి చూస్తున్నట్టుగా నటిస్తూ...

"మొత్తం రాత్రికంతా బుక్ చేసుకున్నాడు..."అంది జయలక్ష్మి నీళ్ళు నములుతున్నట్టు నింపాదిగా. "యేదో సాకు జెప్పి నా కొడుకును హోటల్లోనే పండుకోమని అంపించేసినాను. పైగా యీ పార్టీ కాష్ గూడా ముందే యిచ్చేసినాడు. యిప్పుడింకెట్ల సాధ్యపడితింది?"

శేషాద్రి కాస్సేపు మౌనంగా వుండి పోయాడు. తరువాత పెద్దగా నిట్టూరుస్తూ "పొమ్మంటే పోతాం...నాలుగు కిలోమీటర్లు సైకిలు తొక్కుకుంటా వచ్చినాను..." అంటూ పైకి లేవబోయాడు.

"యెమ్మట్నే తిరుక్కోని పోవాలంటే గెస గదా! కొంచేపు కూర్చోండి. యీ లోపల పార్టీ తలుపులు తెరిచినాడంటే మాట్లాడతాను" అంది జయలక్ష్మి అదోలా చూసి వంకరనవ్వు నవ్వుతూ.

"పోతాంలే జయలక్ష్మీ! మీ నాయిన గూడా వచ్చినట్టుండాడు.." అన్నాడు శేషాద్రి యిష్టం లేనట్టుగా ముఖం పెడుతూ.

"పర్వాలేదులే కుచ్చో" అంటూ జయలక్ష్మి అవతలి వ్యక్తి నిద్రపోతున్నాడన్నట్టుగా సైగచేసింది. "ఆయనకు వొళ్ళు బాగలేదు. ఆస్పత్రికని వచ్చినాడు" అంది. తర్వాత "మీ సులోచన పలకనే లేదు. నామింద కోప మొచ్చిందేమో!" అంటూ నవ్వబోయింది.

సులోచన సైతం నవ్వడం కోసం ప్రయత్నిస్తున్నట్టుగా పెదవుల్ని సాగదీసింది.

"యేమైనా తింటారా? యింట్లో మిక్చరూ, పకోడా వుండాది" అని అడిగింది జయలక్ష్మి. వద్దన్నట్టుగా తల వూపారిద్దరూ! "పోనీ దుడ్డియ్యి. నేనంగిడికి పోయి చికెన్ పకోడా తెచ్చుకుంటా. అట్నే మెడికల్ షాపుకు పొయ్యి మానాయినకు మందులు గూడా తెచ్చేస్తా" అంది జయలక్ష్మి.

శేషాద్రి గుక్కిళ్ళు మింగుతూ "మీ పార్టీపోయినాక యిస్తాలే" అన్నాడు.

జయలక్ష్మి పెద్దగా నవ్వబోయి, అంతలో యెదుటి వాళ్ళను శబ్దం చేయవద్దన్నట్టుగా పెదవులపైన వేలుంచి సైగ జేస్తూ.."ఆయన దగ్గర సెల్లుండాది. మెడికల్ షాపు పక్కనుండే యెస్టీడీ నించీ వొక ఫోను గొడతాను. బిన్నా బయటికి రమ్మంటాను. కానీ దానికైనా నా దగ్గిర రూకలు లేవు. నువ్విస్తేనే.." అంది.

శేషాద్రి పడుకున్న ఆకారంకేసి తేరిపార జూశాక "యేం మందులు తేవాల్నో నీకెట్ల తెలుసు?" అంటూ లా పాయింటు లాగాడు.

"నిన్న పొద్దన్నే డాక్టరు దగ్గిరికి తీసుకోని పోయినాను లే! అప్పుడు దుడ్డు చాల్లేక మందులు తేలేదు. యిప్పటికి యిన్నూరు సర్దినా. యింకా నూరు గావాల్ల..."

"యేం జబ్బు?"

"ముసలితనం. అదే పెద్దరోగం..." అంటూ శేషాద్రి దగ్గరకు జరిగాక "మా ముసిలోడు సటపటమైనోడు గాదు" అంది జయలక్ష్మి. "నా మొగుడు నన్నిడసి పెట్టేస్తే తప్పు నాదని జెప్పి యేడేండ్లుగా నా ముగం జూళ్లేదు. ఆ మనిషి కడపలోనే వొక ఆడ మనిషిని దగ్గిరికి జేర్చుకోని కాపరంజేస్తే దాంట్లో నాదేం తప్పు? అప్పట్నించీ కొడుకు నొకడ్ని దగ్గర బెట్టుకోని యీ వూళ్లో నేనే పడని అగసాట్లే ముండాయి? అప్పుడెప్పుడూ నా పక్కకు తిరిగి జూసినోడుగాదు. పదైదెకరాల చేను, మూడెకరాల మడి. పెద్ద సేద్యం. అయినా వొకసారి గూడా నా పక్కకు చెయ్యిదిలించ లేదు. తల్లిలేని బిడ్డని గూడా అనుకోలేదు. యిప్పుడు నాలుగేండ్లుగా నీళ్ళులేక పంటల్లేవు. కొడుకులంతా పసులెతుక్కుంటా పై గడ్డకు పోయినారు. యిప్పుడు నా గడపెక్కివచ్చినాడు."

శేషాద్రి ముఖం చిట్లించుకుంటూ "మేమిక్కడుంటే నీ మింద అనుమానం వస్తిందేమో మీ నాయినకు..." అన్నాడు.

"ప్చ్..." భయంలేదన్నట్టుగా పెద్దగా పెదవులు చప్పరించేసింది జయలక్ష్మి. "జోబీలో దుడ్డులేనప్పుడు పౌరుమాత్రం వుంటిందా? పాపం, యిప్పుడు యింత తినేసి గొమ్మునే ముదుక్కుని పండుకుంటాడు. కొంచేపు మీరు టీవి చూస్తా వుండండి. నేనీలోపల పదినిమషాల్లో అంగిడికి పొయ్యొచ్చేస్తాను."

జేబులోంచీ యాభైరూపాయల నోటు పైకి తీశాడు శేషాద్రి.

"చాలదు" అంటూ చేతులడ్డంగా పెట్టింది జయలక్ష్మి. "యీ కొంపకు నెలకు యెనిమిది నూర్లు బాడిగ. చాలనిదానికి యెంత లేదన్నా కరెంటు చార్జీ యిన్నూరయితింది. నీళ్లకు కూడా నూరుకట్టాల. యింటిగల్లాయిన రెండు నెల్ల బాడిగ కట్టలేదని దినమ్మూ రంపుజేస్తావుండాడు."

శేషాద్రి మరోయాభై యిచ్చాక, ఆరెండు నోట్లనూ జాకెట్టులోకి దోపుకుంటూ పైకి లేచింది జయలక్ష్మి.

"యీలోపల మీ పార్టీ బయటికొస్తే?...." లోపలిగది తలుపులకేసి బెదురు చూపులు సారిస్తూ శేషాద్రి ప్రశ్నించాడు.

"వచ్చినాడంటే మిమ్మల్ని జూసి హడలెత్తిపోతాడు. మీరిద్దరూ వొకర్ని జూసి యింకొకరు బయపడతా కూచ్చోండి.." పెద్దగా తన్నుకొస్తున్న నవ్వును అణచుకుంటూ, జయలక్ష్మి హవాయి చెప్పులు తొడుక్కుని బయటి కెళ్ళిపోయింది.

టీవీలో వ్యాపార ప్రకటనలు అలలు అలలుగా అల్లుకుపోయి విన్యాసాలు చేస్తున్నాయి. లోపలి గదిలోంచీ మస్కిటోకాయిల్ కాలుతున్న వాసన ఘాటుగా బయటికొస్తోంది. గోడపైన తొండలా పెద్దగావున్న బల్లి పురుగు నొకదాన్ని మింగుతూ శబ్దం చేస్తోంది. గోడపక్కన పడుకున్న మనిషి జీవించే వున్నందుకు దాఖలాగా మూలుగు వినబడుతోంది.

యెవరు ముందు మాట్లాడతారా అని పందెం వేసుకున్నట్టుగా గదిలోని యిద్దరూ మౌనంగా వుండి పోయారు. కాస్సేపటి తరువాత లోపలి గదిలోంచీ యినపమంచం కిర్రుమనడంతో శేషాద్రి వులిక్కిపడ్డాడు. సులోచన ఆ గది గుమ్మంకేసి బిత్తర చూపులు చూడసాగింది. యెంతకూ తలుపులు తెరుచుకోకపోవడంతో శేషాద్రి పెద్దగా నిట్టూర్చాడు. తరువాత మాటలు కూడబలుక్కుంటున్నట్టుగా "తెల్లారి యెనిమిది గంటల నించీ సాయింత్రం ఆరుదాంకా రాబర్ట్‌రూం తాళం చెవి నాదగ్గిరే వునింది. అప్పుడేగాని నువ్వు వచ్చేసి వుంటే మనకిక్కడికి రావాల్సిన అవసరమే వునుండదు." అన్నాడు.

కాస్సేపటి తర్వాత సులోచన తలపైకెత్తి "కాలేజీడే...మాకరెస్పాండెంటు కొడుకు మారేజీ పార్టీ..." అనిగొణిగింది.

"కాలేజీలో జరిగే ఫంక్షన్లకేగాకుండా మీ కరెస్పాండెంటు యింట్లో జరిపే పార్టీలకు గూడా మీరు పనులు చెయ్యాల్నా? ఆ పెద్ద మనిషికి యిద్దురు పెండ్లాలూ, ఆరు మంది కొడుకులూ... యెప్పుడు జూడు, యింట్లో పార్టీలే! యేదో వొకసాకుచెప్పి తప్పించుకోని

రాగూడదా?" గోడ పక్కన పడుకున్న శాల్లీకేసి విసుగ్గా చూస్తూ, సులోచనకు దగ్గరగా జరిగి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు శేషాద్రి.

"యిది యింపార్టెంటు పార్టీ అనీ, పెద్ద వాళ్లంతా వస్తారనీ, రెండు నెలలుగా చెప్తానే వుండారు. పైగా యెలక్షన్లు రాబోతావుండాయి. పార్టీ టికెట్టుకోసరం నెలలో యిరవై దినాలు హైదారాబాదు లోనే వుండి పోతావుండాడు. యిట్లాంటప్పుడు యిచ్చే పార్టీలో పని సక్రమంగా చెయ్యకుండా పోతే, యిక వుద్యోగం వూడిపోయినట్టే..." అంది సులోచన జీరబోతున్న గొంతుకతో.

రెండు నిముషాల తర్వాత పెద్దగా నిట్టూరుస్తూ లోపలి గది తలుపుల కేసి చూసింది. "ఆ పార్టీ యీ పొద్దే బయటి కొస్తాడా?" అంది యెండుకు పోతున్న గొంతుకతో.

"నూర్రూపాయలు జయలక్ష్మి చేతిలో పడినాయి గదా! యింక యముడైనా సరే బయటికి రావల్సిందే!" అన్నాడు శేషాద్రి కరకుగా. సులోచన మరికాస్త జరిగాక "దినానికి యేడు గంటలు చచ్చినట్టుగా పాఠాలు చెప్తానే వుండావు. చాలని దానికి యీ యెక్స్ట్రా పనులు గూడా చెయ్యాల్నా?" అని అడిగాడు.

"నీది సెవనవర్స్ వర్కు గాబట్టి జీతం మూడు వేలు. నాకు యెక్స్ట్రా పనులుండాయిగాబట్టే ఫైవ్ హండ్రెడ్ యెక్కువ.."

"యెమ్మే అవతానే బియ్యీడీ చేసుంటే బాగుణ్ను. అప్పుడు స్పెషల్ టీచరుద్యోగమైనా వచ్చుండును..."

"స్పెషల్ టీచర్లకు తొలిసంవత్సరం నెలకు రెండువేలుగూడా యియ్యరు."

"వొక సంవత్సరం అట్ల కండ్లు మూసుకుంటే ఆపైన నెల నెలా అయిదారు వేలు జీతం... లీవులుంటాయి. సెక్యూరిటీ వుంటుంది. పైగా యీమాదిరి వెట్టి చాకిరీ చెయ్యాల్సిన అవసరమూ వుండదు".

"పోనీ, నువ్వా యెయిడెడ్ కాలేజీ వాళ్ళు ఆఫర్ చేసిన పార్ట్‌టైం జాబ్‌కెందుకు పోలేదో అదిజెప్పు?"

"జీతం నాపేరుతో యిస్తే, ముందుజేరిన వాళ్ళ మాదిరే నేను గూడా సమత్సరమయ్యా గాక ముందే, కోర్టుకుపొయ్యి టైమ్ స్కేలయినా తెచ్చుకుంటానని వాళ్ళ భయం. జీతాన్ని రీసెర్చిగైడు పేరుతో బ్యాంకులో జమ చేస్తామన్నారు. అది ఆయన యిన్‌కం టాక్సులోకి జేరితిందని ఆయన వద్దనేసినాడు. పైగా పార్ట్‌టైంవుద్యోగంలోజేరి రీసెర్చిని నెగ్లెక్ట్ చేస్తావుండానని తిట్టినాడు..."

టీవీలోని కార్యక్రమమేదో కర్ణకఠోరంగా వెలువడుతోంది. గోడపక్కన పడుకున్న ఆకారం పక్కకు తిరిగినట్టు కనిపించడంతో సులోచన కంగారుపడింది. తర్వాత మెల్లగా "హాస్టలు ఫెసిలిటీకి గాకపోతే రీసెర్చిపైన యింట్రెస్టుతో యెవురు చేరతారు? రీసెర్చి చేస్తానే వుద్యోగ మొస్తిందనే నమ్మకమెక్కడుందాది? మనకు డిగ్రీలొస్తే గైడుకు క్రెడిట్టేగానీ, మనకేం లాభం?" అంది.

శేషాద్రి యీసారి ఆమె రెండో చేతిని గూడా తన చేతుల్లోకి తీసుకున్నాడు. "కొత్త గవర్నమెంటొచ్చిందిగదా! రెండుమూడు నెలల్లో అడ్వర్‌టైజ్‌మెంటు వస్తిందని

అంటావుండారు. యెంత లేదన్నా యీవుర్లో వుండే టీటీడీ, యెయిడెడ్ కాలేజీల్లోనే సీనట్లెక్కలోనే నూటికి తక్కువగాకుండా ఖాళీలుండాయి. యింక రాష్ట్రం మొత్తానికీ అంటే చెప్పాల్సినపనేలేదు. యింటర్వ్యూ టయానికి డెజర్టేషను రెడీగావుంటే, వుద్యోగం గ్యారంటీ!" అన్నాడు అనునయంగా.

"ఆమాటే యేడేండ్లుగా చెప్తావుండారు." అంటూ విసుగ్గా ఆమె చేతిని దూరంగా లాక్కుంది.

"అంత సినికల్‌గా మాట్లాడద్దు. అడ్వర్‌టైజ్‌మెంట్‌వచ్చే టయానికి మనం రెడీగా వుంటే మంచిది..."

"పోయిన సంవత్సరంలో బాక్‌లాగ్‌లో రెండు పోస్టులకు అడ్వర్‌టైజ్ చేస్తే యిరవై అయిదువేలు అప్లికేషన్లు వచ్చినాయంట! ఆ వుద్యోగాల్ని ఆఖరికి యేదోమినిష్టరు పేషీలోనే తన్నుకోని బోయినారని పేపర్లలో దుమ్మెత్తిపోసినారు. అయినా పైనుండే వాళ్ళకు చీమగుట్టి నట్టయినాలేదు...."

"అయితే రీసెర్చిపేరుతో హాస్టళ్లో యీరెండెళ్ళూ గడిపేసిన తర్వాత మనగతేందంటావు? అప్పటికి గూడా పర్మినెంటు పోస్టులు రావా మనకు?" అంటూ అదేదో జోక్ అయినట్టుగా పెద్దగా నవ్వుబోయాడు శేషాద్రి.

"రాకపోతే జరిగేదింకేముండాది? యిదే మాదిరుండే సందుల్లో అయిదారు నూర్లకు రెండు రూములు బాడిగకు తీసుకుని, దాంట్లోనే పిల్లల్నిగని దాంట్లోనే..."

సులోచన గొంతు మూగబోవడంతో శేషాద్రి సైతం బెంబేలుపడ్డాడు. ఆమె చేతిని మరింత గట్టిగా పట్టుకుంటూ "యిసారి యెలక్షన్లలో గెలిస్తే మీకరస్పాడెంటు మీకాలేజీకి గ్రాంట్‌యిన్ యెయిడ్ తెప్పిస్తానన్నాడు గదా! అప్పుడు మీకు యూజీసీ స్కేళ్ళు యిస్తారు..." అన్నాడు.

"పదేండ్లకు ముందు అత్తగారిచ్చిన కట్నంతో ప్రైవేటుహైస్కూలు పెట్టినాడు. రెండేండ్లల్లో దాన్ని జూనియర్ కాలేజీచేసి, అయిదేండ్లల్లో డిగ్రీ కాలేజీ చేసినాడు. ఇప్పుడది టౌన్లోనే లీడింగ్ కాలేజీ. వద్దంటే వచ్చేదుడ్డు. ఆ దుడ్డు కాపాడుకోవాలంటే రాజకీయంగావాల్సి వచ్చింది. యిప్పుడు గెలిచినాడంటే మినిష్టరు పదవిపైన ఆశపుడుతుంది. దీనికంతెక్కడ? వాళ్ళ కాలేజీల్లో పనిచేసే వాళ్ళకు అక్విటెన్సులే వుండవు. మనమంతా చీమలమాదిరి చేర్చి చేర్చి పెట్టుకుంటాం. వాళ్ళు వొకేసారిగా అంతా కొల్లగొట్టుకుంటారు. యింకా కావాలంటే సోషియల్ సర్వీసు చేసినామని అవార్డులుగూడా తెప్పించుకుంటారు.." సులోచన గొంతు మళ్లీ జీరబోయింది.

"వ్యాపారంలో దుడ్డుపెట్టినోళ్ళు లాభంరాకుంటే గొమ్మునుంటారా? దేశమూ, సేవా అని పిచ్చిమాటలు చెప్తే వాళ్ళు గూడా పల్లాకుల పాలైపోతారు. మనకీ మాత్రం ఆదరువు గూడా దొరకదు..." అంటూ మరోసారి చలోక్తి విసిరినట్టుగా నవ్వేశాడు శేషాద్రి.

వీధిలో సైలెన్సరుపాడయిన మోటర్‌బైకొకటి బడబడమని శబ్దంచేస్తూ వెళ్తోంది. దూరంగా బైపాస్‌రోడ్డుపైన ఫైరింజను గంటమోగించుకుంటూ పరిగెడుతోంది. గోడమీద గడియారం టిక్కుటిక్కుమంటోంది. గోడపైన బల్లి యెందుకో పెద్దగా కిచకిచమని అరుస్తోంది. లోపలిగదిలోంచీ గుసగుసలు స్పష్టంగా వినబడసాగాయి.

"యీ జయలక్ష్మి పెద్దకంత్రీ. అది సెల్ ఫోనుకు ఫోనుజేసుంటే మనకు వినబడుండాల గదా! యెప్పుడూ కొడుకు యేదో హోటళ్లో పనిజేస్తావుండాడని చెప్తింది. వాడెప్పుడూ నాకు కనబడింది లేదు. మనల్ని బెదిరించేందుకు అట్లా చెప్తావుందేమోనని నాకనుమానం." అంటూ టీవి దగ్గరికెళ్ళి కొద్దిగా శబ్దంతగ్గించాడు శేషాద్రి. తర్వాత "అందుకే ఆసైన్సు బ్లాకు వెనక్కు వెళ్దామనింది" అంటూసాగదీశాడు.

"లేడికి లేచిందే పరుగంటావు. నీదేం పోయింది? అక్కడున్నంత సేపూ యెప్పుడు వాచ్‌మెన్ వస్తాడోనని గుండెలరిచేతిలో పెట్టుకోనుంటాను నేను. తీరావచ్చేసినాడంటే వానిముఖాన యాభై, అరవైగొట్టి దుమ్ము తుడిచేసుకుంటావునువ్వు. నాకైతే సిగ్గుతో చచ్చి పొయ్యినట్టుంటాది. ఆ బాధపడే దానికంటే యిదే మేలు...." అంటూ సులోచన గుమ్మం దగ్గరికెళ్ళి బయటికి తొంగి చూసింది. సందులో యెవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత గొంది చివరిదాకా వెళ్ళి వీధి మలుపు వరకూ కలయజూసింది.

ఆమె తిరిగి యింట్లోకొచ్చే సరికి శేషాద్రి గుమ్మం దగ్గర తచ్చాడుతూ కనిపించాడు. యిద్దరూ మళ్ళీ పాత సోఫాపైకొచ్చి కూర్చున్నారు. అది మళ్లీ కిర్రుమంటూ మూల్గింది.

"పోనీ పుత్తూరుకైనాపోయుంటే బాగుణ్ణు. రాత్రికి లాడ్జీ తీసుకోనుండచ్చు. తెల్లారేసరికి తిరుక్కోనొచ్చేసుండచ్చు..." అన్నాడు శేషాద్రి.

"యే అర్థరాత్రికో హాస్టలు చేరుకోని పదోయిరవయ్యో వాచ్‌మేను ముఖాన పారేసి రూముకు పోయి పండుకోవచ్చు. మావార్డెను శమంతకమణి అసలే గుడ్లగూబ. తెల్లారుతూనే హంగామా చేసేస్తుంది. యేదోసాకు చెప్పుకోక తప్పదు. పొరుగూరికి పొయ్యేదంటే అయిదారు నూర్ల ఖర్చు. ఆమాత్రం దుడ్డుతో మా వూళ్లో మావోళ్లు పదైదు దినాలు తోసేస్తారు..." తమ యింటి సంగతి జ్ఞాపకం రావడంతో సులోచన గొంతు గద్గదికమైపోయింది.

"నిన్నామొన్నా మీ యింటి కాన్నుంచీ సమాచారమేమైనా వచ్చిందా? మీ అన్నేమైనా కనపించినాడంటనా?" అని ప్రశ్నించాడు శేషాద్రి.

"పోయిన వారం మానాయిన హిందూపురం దాకా పోయొచ్చినాడంట. అప్పుడెవురో వొక తూరి అనంతపురంలో కనిపించినాడని చెప్పి నారంట. మావదిన వాళ్ళ పుట్టింట్లో పస్తుయినా పడుంటాను గానీ తిరక్కోని రానని మొండి కేసేసిందంట. యింత జరిగినా యింకో పాయింటులో ఆరునూర్లు దాకా బోరింగేసి చూడాలని మానాయిన రాద్ధాంతం జేస్తావుండాడు. రెండెకరాలకైనా నీటి యేరవ చెయ్యకుండా గొమ్మునుండనని గొడవ చేస్తా వుండాడు. ఆపక్క యిలాకాలో చెరువులన్నీ యెండి పోయినాయి. యింక యెంత లోతుగా పైపులు దించినా లాభంలేదని మా అమ్మ నెత్తీ నోరూగొట్టుకుంటావుంది. మానాయిన యినేటట్టు లేదు. వొకసారి నేనైనా వూరికి పొయ్యి మానాయినతో నేరుగా మాట్లాడేసొస్తే బాగుణ్ణు.."

"నాగ్గూడా మావూరికి పోయొద్దామనేవుంది. కానీ ప్రయాణమంటే యింకో యిన్నూరు మున్నూరు ఖర్చు. కానీ తీరాపోయినా నంటే మా అమ్మేమో పెండ్లి చేసుకోమని మొత్తుకుంటాది. మానాయినేమో నేనంపించేదుడ్డు చాల్లేదని అరస్తాడు..." శేషాద్రి మెల్లగా నవ్వేశాడు.

లోపలిగదిలో సెల్‌ఫోను మోగిన శబ్దం వినబడడంతో సులోచన శేషాద్రికి దూరంగా జరిగికూర్చుని సర్దుకుంది. ఆంటెన్నా సరిగ్గా అందకపోవడంతో లోపలి గదిలోని వ్యక్తి సెల్‌ఫోన్‌తో పడుతున్న అవస్థ స్పష్టంగానే అర్థమవుతోంది. గోడపక్కన కూర్చున్న వ్యక్తి ముసుగుతీయకుండానే దగ్గుతున్నాడు.

"యీరోజు భలేగొప్పగా సెలిబ్రేటవతావుంది" అందిసులోచన నీరసంగా.

"పాకేనదిలో రెండోసారి మునగలేం. రెండో సారి మునిగినప్పుడుండే నీళ్ళు వేరే! టైం గూడా అంతే! అందుకే నాకు బర్త్‌డేలూ, మేరేజ్‌డేలూ అంటే అంత పట్టింపులేదు..."

"అంత వేదాంతం మాట్లాడే వానికి యింత అవస్థపడాల్సిన ఖర్మేం పట్టింది? తెల్లారినుంచీ మా కాలేజీచుట్టూ తిరిగిందెందుకు? పోతే, పోనీ, యింతేగదా మనప్రాప్తమని అనుకోకుండా యిక్కడి దాకా వచ్చిందెందుకు? పోయిన వారం ఆపార్కులో గుచ్చున్నప్పుడు ఆ పోలీసాయిన వచ్చి పట్టుకుంటాడని భయపడిచచ్చినాను. పిల్లికి చెలగాటం, యెలుకకు ప్రాణ సంకమంటారు జూడు. అట్లుంది నాబతుకు..." మాట్లాడుతూనే ముఖమవతలికి తిప్పుకుని కొంగుతో కళ్ళుతుడుచుకుంది సులోచన.

యింతలో చివాలున లోపలి గది తలుపులు తెరుచుకున్నాయి. జీరోవాల్ట్స్ బల్బు వెలుతురులోంచీ బయటికొచ్చిన వ్యక్తి కాస్సేపు కళ్ళు నులుముకుంటూ అక్కడే నిలబడ్డాడు. లావుగా, పొట్టిగా వున్న అతను నీలి రంగు టీ షర్టూ, నల్లటి పాంటూ తొడుక్కున్న నీటి యేనుగులా కనిపిస్తున్నాడు.

బయటి గదిలో కొత్త వ్యక్తులను గమనించగానే అతను కాస్సేపు విస్తుపోయాడు. పక్కన మగవాడొకడున్నాడన్న విషయాన్ని పట్టించుకోకుండా సులోచనను కాస్సేపు తీక్షణంగా చూశాడు. తరువాత తాపీగా బయటికి వెళ్ళిపోయాడు.

శేషాద్రి గుండెలు కొట్టుకుంటూ వుండగా, లోపలి గది గుమ్మం కేసి కళ్ళార్పకుండా చూడసాగాడు. దాదాపు పది నిమిషాల సేపు అసహనంతో అతను యెదురు చూసిన తరువాత, లోపలినుంచీ మెడవొకటి బయటికి పొడుచు కొచ్చింది. మరో రెండు నిముషాల తరువాత సన్నగా, పొడుగ్గా చీర చుట్టుకున్న కొంగలాంటి ఆకారం బయటి కొచ్చింది.

కొంగుతో ముఖం తుడుచుకుంటూ సోఫాపై కొచ్చి కూర్చుంది ఆవిడ. పక్కకు తిరిగి చూడకుండా టీవీ కేసి చూస్తూ "జయలక్ష్మి యెక్కడ?" అని ప్రశ్నించింది కీచు గొంతుకతో

సులోచన ఆవిడ నుంచీ దూరంగా జరుగుతూ "అంగడికి పొయ్యింది" అంది.

ఆవిడ కప్పుకేసి వో సారి చూసి "యీ కొంపలో యెక్కడ గానీ ఫేను కూడా లేదు" అని విసుక్కొంది. తరువాత మళ్లీ టీవీ కేసి చూస్తూ నీ దేవూరు?" అని అడిగింది.

సులోచన గూడా అంతే విసుగ్గా ముఖం పెట్టుకుని "నాదా? టీవీదా?" అని అడిగింది. శేషాద్రి కిసుక్కుమని నవ్వాడు. ఆవిడ మరింతగా ముఖం ముట ముట లాడించుకుంటూ "నీ మొగుడేం చేస్తాడు?" అని అడిగింది, మొదటి ప్రశ్నకు దొరికిన సమాధానంతో సంతృప్తి పడినట్టుగా.

సులోచన శేషాద్రి వైపుకు చూస్తూ "లెక్చరరు.." అంది. ఆవిడ బిక్క మొహం పెట్టినట్టుగా తోచడంతో "పెద్ద స్కూల్లో పాఠాలు చెప్తాడు" అంది.

ఆవిడ మూతి తిప్పుతూ "నిజం చెప్పేది యిష్టం లేకపోతే గొమ్మునుండు. నేనేమైనా పార్టీనా, పెద్ద వుద్యోగం జేసే మొగుడుండాడని చెప్తే, యింకో రెండు రూకలు చానాగా యిచ్చే దానికి? మొగుడు అంత పెద్ద వుద్యోగమే చేస్తే యిన్ని అగసాట్లెందుకు?" అంది. ముఖద్వారం దగ్గర చెప్పుల సవ్వడి వినబడగానే "యింత రేత్తిరిలో యాడికి పోయి నావక్కా? బిన్నారా! నేను యెలబారాల.." అంటూ పెద్దగా కేకేసింది.

ఆవిడ గొంతు వినబడగానే జయలక్ష్మి గెంతినట్టుగా యింటి లోపలికి దూకి, "జోతీ, సారెక్కడ," అంది పెద్దగా కంగారు పడిపోతూ.

"అయిన పోయి అరగంటయింది. నాకు రావల్సిందేందో నాకు పారేస్తే నేనూ పోతాను. యిప్పటికే యింటికాడ నా కోసరం యెతకతా వుంటారు. ఆలస్సెం జేస్తే అందురికీ డౌట్" అంటూ సమాధానం చెప్పింది.

"ఆ మనిషి రూకలియ్యకుండానే జారుకున్నాడే! యింగెప్పుడొస్తాడో యేమో!..." అని తన కంగారును మరికాస్త పెంచుతూ, టీవీ స్టాండు పక్కన, నేలపైన, చేరగిల బడింది జయలక్ష్మి. పక్కన దబ్బున శబ్దం రాగానే ముసుగు కప్పుకుని పడుకున్న వ్యక్తి మరో వైపుకు దొర్లుకున్నాడు.

"నువ్వు ముందుగానే దుడ్డు లాక్కున్నావని ఆ సారు గొణగతానే వున్నాడు. నారెక్కల కష్టం నా కిచ్చెయ్యి. యింటికిపోయి యెసురు బెట్టాల.... అంటూ పెద్దగా అరిచింది జ్యోతి..

గుమ్మం దగ్గర చరచరమంటూ చెప్పుల శబ్దం వినబడింది. వోరగా తెరిచిన వాకిలిలోంచీ బయటికి చూస్తూ బిగ్గరగా "అంత పెద్దగా అరవద్దు. నీ చీటీ దుడ్డు నీ కియ్యకుండా నేనెక్కిడికి పోతాను? అయితే చీటీ పాడుకున్న మనిషి లేటు జేసినప్పుడు నేనేం చేసేది?" అంటూ అరిచింది జయలక్ష్మి.

జ్యోతి కాస్సేపు బిక్కమొహం పెట్టుకుని అటూయిటూ తిరిగి చూసింది. తరువాత పెదవుల్ని వంకరగా సాగదీసి నవ్వేసింది.

"యెవురైనా నీ యింటిలోకి తొంగి చూసినట్టు అనుమానం వస్తేచాలు, తెలివిగా మాటలు మార్చి, నాటకాలు జేసేది మాత్రం బాగానే నేర్చినావు. ఆ బయిం మాలాంటోళ్ళ దగ్గిర వుంటే గదా!" అంటూ జయలక్ష్మి వైపుకు వేళాకోళంగా చూడబోయింది. కానీ జయలక్ష్మి కంగారు పడుతూ పైకి లేవటం చూడగానే వెనక్కు తిరిగింది. సోఫా పైన కూర్చున్న వ్యక్తులిద్దరూ కంగారు పడుతూ పైకి లేవడం గమనించగానే బెంబేలు పడుతూ ద్వారం కేసి చూసింది.

బూట్లు టక టక లాడించుకుంటూ కాకీ బట్టలు తొడుక్కున్న వ్యక్తిలోని కొచ్చాడు. దట్టంగా వున్న అతడి జుట్టు హేటు నొక్కులు పడ్డ చోట తెల్లబారుతోంది. తెలుపూ నలుపూ కలగలిసిన అతడి మీసాల కుదుళ్ళలో చెమట బిందువులు పొట మరిపిస్తున్నాయి. గది తలుపులు బాగా చిన్నవని నిరూపించడం కోసమన్నట్టుగా అతడి ఆకారం పొడవుగా, లావుగా కనబడుతోంది. విసుగ్గా నిట్టూరుస్తూ అతను లోపలికొచ్చి కూర్చున్నాడు. యీ లోగా మరో కాకీ దుస్తుల మనిషి గుమ్మాని కడ్డంగా సందులో నిల్చున్నాడు.

రుమాలుతో ముఖానికి పట్టిన చెమటను తడుచుకుంటూ "యేందీ కథ? యింకా నీ యవ్వారం మారలేదా?" అంటూ యెస్సై జయలక్ష్మి కేసి చూస్తూ కళ్ళెగరేశాడు.

ఖాకీ దుస్తుల వ్యక్తిని చూడగానే జ్యోతికి భయంతో వొళ్ళంతా చెమటలు పట్ట సాగాయి. తాను కూచోవాలో, నిలబడాలో తెలియక శేషాద్రి తటపటాయించసాగాడు. అతడి చాటులో స్థలం చాలక సులోచన బిక్క మొహం పెట్టేసింది. జయలక్ష్మి బలవంతంగా నవ్వు కొనితెచ్చుకుంటూ "ఆ యాపారం యెప్పుడో ఆపేసినానుసా! వీళ్ళిద్దరూ మా చుట్టాలు. ఆ ఆడబిడ్డది మా యెనకాల యీధి. ఆ పండుకోనుండేది మా నాయిన. ఆయినకు వొళ్ళు బాగాలేదు. ఆస్పత్రి కోసరమని మా పల్లె నించీ వచ్చినాడు. ఆయనను చూసే దానికి వీళ్ళంతా వచ్చినారు" అంటూ తన లావుపాటి శరీరాన్ని అదోలా వయ్యారంగా వంచింది.

యెస్సయి గదిలోని వ్యక్తులనంతా పరీక్షించి చూశాక "నీదేవూరు?" అంటూ జ్యోతిని పలకరించాడు.

"మాది మామిడిమానుగడ్డ సార్! అక్కడ మాకు ఆరెకరాల చేనుండాది. మూడేళ్ళుగా వానలు లేక పరిగిలికొదిలేసినాం. కూలీ పన్లు జేసుకుందామని యీ వూరొచ్చి సంవత్సరం దాటుతా వుండాది. మా యాజమానుడు బేల్ దారీ పనిజేస్తాడు.... యిప్పుడు క్రిష్ణా నగరంలో మేస్త్రీ మునిరత్నంరెడ్డి దగ్గిర మేస్త్రీగా వుండాడు" అంది వివరంగా.

జ్యోతి కేసి హేళనగా వొక నవ్వును విసిరేశాక యెస్సయి శేషాద్రి వైపుకు తిరిగి "యింక మీరు చెప్పండి సార్! మీరే బిల్డింగ్ కాంట్రాక్టరుగా వుండారు? గదా!" అంటూ యెకసెక్క మాడాడు.

"నేను వీయమ్మార్ డిగ్రీ కాలేజిలో లెక్చరరుగా పని జేస్తాను సార్! యీమె నా భార్య యీమె యీయెస్సెన్ డిగ్రీ కాలేజీలో లెక్చరరు..." అన్నాడు శేషాద్రి వీలయినంత ధీమాగా మాట్లాడడానికి విఫలయత్నం చేస్తూ.

యెస్సయ్యి కాస్సేపు అటూయిటూ చూశాక "అని నన్ను నమ్మమంటావు!" అన్నాడు తాపీగా.

"కావాలంటే యీ ఐడెంటిటీ కార్డు చూడండి సార్"! అని చెబుతూ జేబులోంచీ కార్డు తీసి యెస్సయ్యి చేతికందించాడు శేషాద్రి.

యెస్సయ్యి దాన్ని చదివాక "యిది స్టూడెంటు ఐడెంటిటీ కార్డు. నువ్వు పీహెచ్డీ చేస్తావుండావని వుండాది దీంట్లో" అన్నాడు గదిమూల గోడపైని గాడిద బొమ్మకేసి చూస్తూ..

"అవునవును సార్! నేనూ నా వైఫూ యిద్దరూ రీసెర్చి చేస్తావుండాము. యిద్దరూ హాస్టల్లో వుండాము" తన మాటలకు ఆధారం దొరికిన సంబరంలో శేషాద్రి వుత్సాహ పడిపోయాడు.

"యిప్పుడు హాస్టల్లో స్టూడెంట్లు కాపురాలు గూడా పెట్టేసినారా?" అంటూ యధాలాపంగా ప్రశ్నించాడు యెస్సయ్యి.

"లేదు సార్! నేనుండేది మెన్స్ హాస్టల్లో!" దొరికిపోయిన దొంగలా తబ్బిబ్బు పడిపోయాడు శేషాద్రి. "నా వైఫు వుమెన్సు ఆస్టల్లో వుంటాది. మా కొచ్చే రెండు మూడు

వేలతో సంసారం బెట్టే దానికయితిందా? పైగా నా వైపు వుద్యోగం చేస్తావుందనే మాటే గానీ, సంపాదనంతా నెల నెలా వాళ్ళింటికే పంపించేస్తాది." అన్నాడు తెల్లబోయిన ముఖంతో.

అంతవరకూ మౌనంగా వుండిపోయిన సులోచన "యీయనది రాయచోటి దగ్గర కొత్త కాలవసార్!" అంటూ విసురుగా అందుకుంది. "వాళ్ళకు వొళ్ళు బాగాలేదని వొక నెల, వాళ్ళ యినకేందో అవసరమొచ్చిందని యింకో నెల, వాళ్ళచెల్లి సమర్తాడిందని యింకో నెల, యీ మాదిరిగా ప్రతి నెలా యీయన గూడా జీతం దుడ్డుంతా వాళ్ళూరికే పంపిచేస్తా వుండాడు. యింకా యేమైనా అన్నామంటే వానల్లేక, పంటలు పండక, వాళ్ళోళ్ళంతా పస్తులుండారని రాగాలు తీస్తాడు."

యెస్సయ్యి హేటుతో గాలి విసురుకుంటూ... "హాస్టల్లో స్కాలర్ షిప్పులు తీసుకోని రీసెర్చులు జెయ్యకుండా వుద్యోగాలు జేస్తా వుండారు. జీతాలేమో మీ యిండ్లకు పంపించేసి కులకతా వుండారు" అన్నాడు తలనదోలా తిప్పుతూ. తరువాత మరిచిపోయిన విషయమేదో జ్ఞాపకం వచ్చినట్టుగా "మీ యిద్దరికీ పెళ్ళయినట్టు గారెంటీ యేముండాది?" అని అడిగాడు.

కత్తి వేటుకు నెత్తురు చుక్కలేనట్టుగా పాలిపోతున్న సులోచన ముఖం కేసి చూస్తూ పర్వాలేదు లెమ్మన్నటుగ్గా సైగ చేశాడు శేషాద్రి. తన పర్సులోంచీ చిన్న ఫోటోను పైకి తీసి "చూడండి...మా పెళ్ళి ఫోటో" అన్నాడు.

"దండలు మార్చుకోని స్టుడియోలో తీసుకున్న ఫోటో మాదిరుండాదిది. యిదేం పెండ్లి ఫోటో..." అంటూ దబాయించాడు యెస్సై.

"నాకు పర్మినెంటు వుద్యోగం వచ్చేదాకా పెండ్లి చెయ్యనని మా నాయన పట్టుబట్టేసినాడు సార్! వాళ్ళింట్లో వాళ్ళు ఆమె పెండ్లి మాట యెత్తలేదు. అందుకని మా వోళ్ళకెవురికీ చెప్పకుండా రిజిష్టరు మారేజీ చేసుకున్నాము" అన్నాడు శేషాద్రి. యస్సై చూపులు అదోరకంగా మారడం గమనించగానే "నాకిప్పుడు వయస్సు యిరవై తొమ్మిది సార్! యెమ్మే అయినాక యీ కాలేజీలో లెక్చరరుగా చేరిపోయినాను. రెండేండ్లకు ముందు పీహెచ్డీలో సీటొచ్చింది. అప్పుడు హాస్టల్లో జేరినాను" అంటూ మరికొన్ని వివరాలు సరఫరా జేశాడు.

చేతిలోని ఫోటోనూ, యెదుట నిల్చున్న వ్యక్తుల్నీ మార్చీమార్చీ చూశాక "అంతా బాగనే వుంది. మీరిద్దరూ యీ కొంపకెందుకొచ్చినట్టు?" అని అడిగాడు యెస్సయి

శేషాద్రి పెదవులు కదిలాయి. మాటలు పైకి వెలువడలేదు. సులోచన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

జ్యోతి కాస్త ధైర్యంకొని తెచ్చుకుని "నేను పోవాల... టయమయ్యింది" అంటూ కదలబోయింది.

మళ్ళీ మొదటి నుంచీ వివరాలు చెప్పక తప్పదన్నట్టుగా జయలక్ష్మి "ఆ యాపారాలు నేను మానేసి నాను సా! మా నాయినకు వొళ్ళు బాగలేదని పల్లె నించీ వచ్చినాడు. వీళ్ళిద్దరూ..." అని మళ్ళీ మొదలెట్టింది.

యెస్సయి పైకి లేచి కొట్టబోతున్నట్టుగా చేయి విసిరాడు. "నోర్ముయ్యి! యిక్కడేం జరగతావుందో మేము తెలుసుకో లేదనుకుంటా వుండావు నువ్వు .. దొంగ..."

"మేము ఆయన్ను చూసి పోదామని వచ్చినాం సార్! మాదేం తప్పు లేదు. హాస్టలుకు పోతాం..." అంటూ జీరబోతున్న గొంతుకతో వేడుకున్నాడు శేషాద్రి.

టీవీలోంచీ వెలువడుతున్న వెలుతురు మరకలు గదిగోడపైన దోబూచు లాడుతున్నాయి. గోడ పక్కన పడుకున్న శాల్తీ కేసి విసుగ్గా చూశాడు యసై్స. మరచి పోయిన విషయం జ్ఞాపకం వచ్చినట్టుగా జయలక్ష్మి పడుకున్న వ్యక్తి దగ్గరికెళ్ళి "కొంచెం పైకి లెయ్యి నాయినా! మాత్ర మింగేసి పండుకుందువు గానీ..." అని పలకరించింది.

యెస్సయ్యి సులోచన కేసి కోపంగా చూస్తూ "నీ వయస్సెంత?" అని ప్రశ్నించాడు.

"ఆమె గూడా మేజరు సార్! యిరవై ఎనిమిది దాటింది" అంటూ అరిచాడు శేషాద్రి.

యెస్సయ్యి శేషాద్రి కేసి గుడ్లురిమి చూశాడు.

"నిజం సార్, యెమ్మే అయినాంక ఆమె గూడా యీ ఉమెన్స్ కాలేజీలో లెక్చరరుగా జేరిపోయింది. ఆమెకు గూడా రెండేండ్లకు ముందే రీసెర్చిలో సీటు దొరికింది. యిప్పుడామెకు ఆ కాలేజీలో ఆరేండ్ల సర్వీసుండాది. అయితే అది పార్ట్‌టైం జాబుకిందే లెక్క! అక్విటెన్సులూ, సర్వీసు రిజిష్టర్లు గూడా లేవు" అంటూ గింజుకున్నాడు శేషాద్రి.

యెస్సయ్యి చివాలున పైకి లేచి గబగబా యింటి బయటికి నడుస్తూ "అదంతా నాకు చెప్పి లాభం లేదు. మీరిద్దరూ యీ కొంప కెందుకొచ్చినారో రేపు జడ్జికే చెప్పుకోండి" అన్నాడు. చిత్రంగా అతడి గొంతులోనూ పెద్ద జీర తొంగి చూసింది.

"సార్సార్! మేమేమీ తప్పు జెయ్యలేదు..." పెద్దగా ఆక్రోశించాడు శేషాద్రి.

సందులో కెళ్ళాక తిరిగి చూస్తూ "నిజమే, మీ తప్పేమీ లేదు" అన్నాడు యెస్సయ్యి హేళనగా. "మీ లాంటోళ్లకు వుద్యోగా లిచ్చి నారే వాళ్ళదీ తప్పు! సీట్లిచ్చి రీసెర్చిలో జేర్పించుకున్నోళ్ళది అఫెన్సు. యిట్లాంటి చోట్లో దొరికినారని చార్జిషీటు ఫ్రేంజేసినందుకు నాదీ క్రైమ్.. మీ మాదిరి మిడిమాళం చదువులు చదివినోళ్ళ తో డిస్కెషన్ పెట్టుకునిందే నా పొరబాటు. మీతో కొంచెం కేర్ఫుల్గా వుండాల. మీ అంత గుండెలు తీసిన బంట్లు యెవరూ వుండరు. కావాలంటే మీరు గవర్మెంటునే బోనెక్క మంటారు". మాట్లాడుతూనే అతను వీధిలో నిలుచున్న పోలీసుకేసి సైగ చేశాడు. "వీళ్ళందర్నీ జీపెక్కించు" అని చెబుతూ గబగబా గొంది చివర సందు మొగదలలో ఆగిన జీపు కేసి సరసరా సాగిపోయాడు.

**(డిసెంబరు 2005, సాహిత్యనేత్రం)**